

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 02-07-2026 సంపుటి : 08 సంచిక 21 పేజీలు : 8 వెల : రూ 3-00


## నేను బటన్ నొక్కే వ్యక్తిని కాదు.. ప్రజల్లో ఉండే వ్యక్తిని: సీఎం చంద్రబాబు

నెల్లూరు, జులై 1: పేదలను ఆనందంగా చూడాలన్నదే తన లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు(బుధవారం) పున్నపువారిపాలెంలో నిర్వహించిన ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నామని.. 62.20 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. 28 కేటగిరీలకు పెన్షన్లు అందిస్తున్నామని అన్నారు. పేదల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు తీసుకువస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. 'నేను బటన్ నొక్కే వ్యక్తిని కాదు.. ప్రజల్లో ఉండే వ్యక్తిని' అని స్పష్టం చేశారు. ఒక నెలలో తీసుకోకపోయినా..3 నెలలకు ఒకేసారి పెన్షన్ ఇస్తున్నామని అన్నారు.రాష్ట్ర పునర్నిర్మాణానికి తాను, డిప్యూటీ సీఎం పవన్ కలిసి ముందుకొచ్చామని సీఎం తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. సుపరిపాలనకు నాంది పలికామని.. ఏ ఆఫీస్‌కు వెళ్లకుండా మనమిత్ర యాప్ తెచ్చామని అన్నారు. మనమిత్ర యాప్‌లో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పుడిప్పుడే అన్ని డిపార్ట్‌మెంట్లను గాడిలో పెడుతున్నామని వెల్లడించారు. పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాలా ముందుందని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేస్తామని చెప్పారు. కేంద్రాన్ని ఏం అడిగినా సాయం చేస్తోందన్నారు.దేశంలోనే నం.1 జిల్లాగా నెల్లూరును మారుస్తామని వెల్లడించారు. నెల్లూరుకు 27 భారీ పరిశ్రమలు వస్తున్నాయని.. దేశంలోనే మెగా ఫర్నిచర్ పార్క్ గూడూరులో వస్తోందని తెలిపారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయన్నారు. నదుల అనుసంధానమే నీటి సమస్యకు పరిష్కారమని చెప్పుకొచ్చారు. వెలిగొండను పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. భవిష్యత్తులో అన్ని ఏసీ బస్సులే ఉంటాయన్నారు. పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేదవాళ్లందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తామన్నారు. డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని.. గత ఏడాది జూన్‌లోనే ప్రాజెక్టులకు నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈసారి జులై వచ్చినా.. ప్రాజెక్టులకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదన్నారు. వర్షాలు లేక కృష్ణా, గోదావరి నుంచి నీళ్లు వచ్చేలా లేవన్నారు. గోదారి-కావేరి అనుసంధానం కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల అన్నింటి ధరలూ పెరుగుతున్నాయన్నారు. కష్టాలు వచ్చిన సమయంలో తెలివిగా వ్యవహరించాలని అన్నారు. దేశం నాకేం ఇచ్చింది కాదు.. దేశానికి నేనేం ఇచ్చానని ఆలోచించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం కోసమే తన ప్రయత్నమని తెలిపారు.రాష్ట్రంలో ఓ గొడ్డలి పార్టీ ఉందని.. ప్రజలు కూడా ఆ పార్టీని గొడ్డలి పార్టీగానే పిలవాలంటూ సీఎం వ్యాఖ్యానించారు. గొడ్డలి పార్టీ నుంచి రోజుకో ఫేక్ న్యూస్ వస్తోందని మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.




అమరావతిని రాజధానిగా ప్రకటిస్తే అందరూ మద్దతు ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక అమరావతిపై మాట మార్చారని విమర్శించారు. మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడు మావిగన్ అంటున్నారని ఫైర్ అయ్యారు. గొడ్డలి పార్టీకి తప్ప.. అందరికీ రాజధాని కావాలన్నారు. రాజధానిని వ్యతిరేకించినందుకే 11 సీట్లకు పరిమితమయ్యారని తెలిపారు. కుల రాజకీయాలు చేయాలని చూశారని ఆరోపించారు. కేంద్రానికి చెప్పి రాజధానికి చట్టం చేయించామని.. చట్టం చేసినా రాధానిని గొడ్డలిపార్టీ అంగీకరించడం లేదన్నారు. రౌడీలతో రాజధాని రైతులపై దండయాత్రకు వెళ్లారని మండిపడ్డారు. రౌడీయిజం చేస్తామంటే ఎవరూ ఊరుకోరని హెచ్చరించారు.సాయికృష్ణ కేసులో ఉపముఖ్యమంత్రి పవన్‌ను తీసుకొచ్చారని చంద్రబాబు మండిపడ్డారు. పవన్, ఆయన కూతుళ్లపై ఇష్టారీతిన పోస్టులు పెట్టించారన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించి పైశాచిక ఆనందం పొందారని ఆగ్రహించారు. బ్లేడ్ బ్యాచ్‌లు, రౌడీలు, గూండాలకు వైసీపీ మద్దతిస్తోందని ఆరోపించారు. హోం మంత్రిపై కూడా మేకప్ అంటూ కామెంట్స్ చేస్తున్నారని అన్నారు. 'తప్పు కదా అంటే.. నా ఇష్టం అంటూ అమర్నాథ్ మాట్లాడుతున్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుంది' అంటూ సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## 18 నగర వనాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి: రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సవిత తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. మన వారసత్వం అనేది కేవలం మనం నిర్మించిన కట్టడాలు మాత్రమే కాకుండా, మనం కాపాడిన ప్రకృతి అయి ఉండాలని అన్నారు. నగర వనాలు పట్టణాలకు గ్రీన్ లంగ్స్‌లా పనిచేస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ 'నగర వన యోజన' నిధులతో పాటు స్థానిక నిధులను వినియోగిస్తూ రూ.36 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఒక్కో నగర వనాన్ని సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో, రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ప్రత్యేకంగా ఎర్రచందనం పరిరక్షణ పార్కులను ఏర్పాటు చేశామని, జీవవైవిధ్య పరిరక్షణతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నక్షత్ర వనాలు, రాశి వనాలను కూడా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ పార్కుల్లో పక్షుల ఆవాసాలు, బోటింగ్, కయాకింగ్, ట్రెక్కింగ్ పాయింట్లు, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి సౌకర్యాలను కల్పించామని తెలిపారు. ఇవి కేవలం పచ్చదనాన్ని పెంచడానికే కాకుండా.. ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వనాలను పరిరక్షిస్తూ, మరింత పచ్చని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.ఈ క్రమంలోనే వాక్ స్వాతంత్ర్యం పేరుతో వ్యక్తిత్వ హననం, నిరాధార ఆరోపణలు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును తమ ప్రభుత్వం ఎప్పుడూ గౌరవిస్తుందని, అయితే ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. వ్యక్తిగత దూషణలు, హత్య చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని పవన్ వ్యాఖ్యానించారు. మత విశ్వాసాలను దెబ్బతీసే వ్యాఖ్యలను ఏమాత్రం సహించబోమని ఆయన హెచ్చరించారునిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తామని, కానీ సోషల్ మీడియా వేదికగా సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్టలు తీయాలనుకోవడం పద్ధతి కాదని తెలిపారు. నేరాలకు కులం, మతంతో సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియా వేధింపులకు గురవుతున్న వారికి అండగా నిలిచేందుకు డిప్యూటీ సీఎం కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పవన్ వెల్లడించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని, నిందితులను శిక్షిస్తామని స్పష్టం చేశారు.

## విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు

అనంతపురం, జులై 1: ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. విద్యా శాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కృషి చేస్తూ, ఎన్నో సంస్కరణలు విజయవంతంగా అమలు చేస్తున్న లోకేశ్‌ను రాష్ట్రపతి అభినందించారు. ఈ సంస్కరణలు కొనసాగాలని సూచించారు. ఈరోజు(బుధవారం) అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి హాజరై తిరిగి వెళుతున్నప్పుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు హెలికాప్టర్ వరకు మంత్రి లోకేశ్ వెళ్లారు. తన దగ్గరకు మంత్రిని పిలిచిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యాసంస్కరణలు, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు చాలా బాగున్నాయని అభినందించారు. వీటిని కొనసాగించాలని సూచించారు.విద్యార్థులు కేంద్రంగా సాగుతున్న విద్యా వ్యవస్థలో మార్పులు వారి బంగారు భవిష్యత్తుకు మార్గం వేస్తాయని రాష్ట్రపతి అన్నారు. స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగం స్ఫూర్తివంతంగా సాగిందని అభినందించారు. సభకు హాజరైన గ్రాడ్యుయేట్స్‌కు మంచి సందేశం ఇచ్చారని లోకేశ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు.








## ప్రధాని మోడీజీ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర -2047 దిశగా చంద్రబాబు అడుగులు

### ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ గమ్యస్థానంగా ఏపీ!

### లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తి రాష్ట్రపతి ముర్ము జీవితం

### సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు

### ఉద్యోగార్థులుగా కాదు... ఉద్యోగాల సృష్టికర్తలుగా యువత ఎదగాలి

### అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ తొలి కాన్వకేషన్ లో మంత్రి లోకేష్



అనంతపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశ జాతీయ విద్యా విధానం (ఔఇఖ), డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ 2047 దార్శనికత ద్వారా విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను ( నిర్మిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర - 2047' దిశగా అడుగులు వేస్తున్నారు. తద్వారా విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించగల, భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈరోజు యువ పట్టభద్రులతో నిండిన ఈ సభను చూస్తున్నప్పుడు... నాకు కేవలం పట్టాలు స్వీకరిస్తున్న విద్యార్థులు మాత్రమే కనిపించడం లేదు. భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్న ఒక తరం కనిపిస్తోంది. ప్రతి తరానికీ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. భవిష్యత్తును నిర్మించే అవకాశం ఈ తరానికి లభించింది. ఇది మీ సమయం, ఇది మీకు లభించిన గొప్ప అవకాశం. మీ నేపథ్యం మీ భవిష్యత్తును నిర్ణయించేలా ఎప్పుడూ అనుమతించకండి. మీ కలలు, మీ కఠోర శ్రమ, మీ వ్యక్తిత్వం... ఇవే మీరు ఎవరన్నదానిని నిర్వచించేలా చూసుకోండని అన్నారు.ముర్మ జీవితం... స్ఫూర్తిదాయకంఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ తో కలిసి ఇక్కడ కూర్చునే భాగ్యం మనకు దక్కింది. ఆమె జీవితం కేవలం తరగతి గదిలో నేర్వలేని ఒక పాఠం. ఆమె ఒక చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. చాలా మందిలాగే కుంగదీసే వ్యక్తిగత విషాదాలను ఆమె ఎదుర్కొన్నారు. అయినా ఆమె ఎన్నడూ విశ్వాసం కోల్పోలేదు... సేవ చేయడం ఆపలేదు... ముందుకు సాగడం ఆపలేదు. ఒక ఉపాధ్యాయురాలిగా... ఒక శాసనసభ్యురాలిగా... ఒక గవర్నర్గా... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు.ఆమె ప్రయాణం ప్రతి యువ విద్యార్థికి ఒక సత్యాన్ని చెబుతుంది... మీ ప్రారంభం మీ గమ్యాన్ని నిర్ణయించదు. మీ ధైర్యమే నిర్ణయిస్తుంది. భారత రాష్ట్రపతి ఒక చిన్న గిరిజన గ్రామం నుండి రాష్ట్రపతి భవన్కు ఎదగగలిగితే... మీ విద్య మీకు ఏమి సాధించడంలో సహాయపడుతుందో ఊహించండి.

# సంపాదకీయం

గురువారం 02-07-2026

## మారిన ఆప్ టెంపుల్ రన్

జాబ్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం రాష్ట్రంలోని 22 పట్టణాల్లో ప్రతీ సోమవారం సాయంత్రం "ఏక్ శామ్ శివ్ కా నామ్" కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కార్యక్రమాల్లో శివుని పేరిట భజనలు, పూజలు నిర్వహించి, ధార్మిక సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. "జై శ్రీరాం", "హర హర మహాదేవ్" నినాదాలు ఇచ్చి, ప్రభుత్వ నిధులతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమృత్‌సర్‌లోని వాల్మీకి ఆశ్రమం అభివృద్ధి, పాటియాలాలో కాళీమాత ఆలయ నిర్మాణం వంటి ప్రకటనలు కూడా చేశారు. ముఖ్యమంత్రి తీర్థయాత్ర యోజన కింద సాలాసర్ బాలాజీ, ఖాతూశ్యాం, మథుర-బృందావన్, హృషికేష్-హరిద్వార్, ఆనంద్‌పూర్, అమృత్‌సర్ వంటి క్షేత్రాలకు ప్రజలను తీసుకెళ్లే హామీ ఇచ్చారు. ఈ పథకాలను పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. సీఎం భగవంత్ మాన్, కేజ్రీవాల్ ఇద్దరూ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ప్రజలు "జై శ్రీరాం" అని నినదించగా, నాయకులు "జై సియారామ్" అని చెప్పారు. కేజ్రీవాల్ మాట్లాడుతుండగా సీఎం భగవంత్ మాన్‌ను చూసి ప్రజలు చప్పట్లు కొట్టడం గమనార్హం. పంజాబ్‌లో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పట్టణాల్లో హిందువులు గణనీయంగా ఉండటం, గ్రామాల్లో సిక్కులు ఎక్కువగా ఉండటం వల్ల హిందూ ఓట్లను ఆకర్షించడానికి ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు కనిపిస్తోంది. ఆప్ తనను తాను సెక్యులర్ పార్టీగా చెప్పుకుంటూ, ఇప్పుడు స్పష్టంగా హిందూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. సాధారణంగా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు అంటే బీజేపీ గుర్తుకు వస్తుంది. సీఎం అయితే యోగా ఆదిత్యనాథ్ గుర్తొస్తారు. కానీ దేశంలో హిందువుల పునరేకీకరణ నేపథ్యంలో ఇప్పుడు అన్ని పార్టీలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఢిల్లీలో రెండోసారి అధికారంలోకి రావడానికి హనుమాన్ చాలీసా పాడిన ఆప్, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కూడా చండీ మంత్రం, హనుమాన్ చాలీసా ఆలపించింది. ఇప్పుడు పంజాబ్‌లో కూడా ఇదే వ్యూహం అనుసరిస్తోంది. అయితే కేజ్రీవాల్ ప్రకటనలు చేయడం, సీఎం భగవంత్ మాన్ వెనకబడి ఉండటం వల్ల పార్టీలో సీఎం, కన్వీనర్ మధ్య సఖ్యత లేదన్న అభిప్రాయం బయటకు వస్తోంది. రామనామం ఓట్లు తెచ్చే అవకాశం ఉందని ఆప్ భావిస్తోంది. దేశంలో రాజకీయ పార్టీలు కులం, మతం ఆధారంగా రాజకీయాలుచేస్తున్నాయి. అయితే ప్రస్తుతం హిందుత్వం బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఒకప్పుడు మైనారిటీలకు మద్దతు ఇస్తూ సెక్యూలరిజం అని చెప్పుకున్న పార్టీలు కూడా ఇప్పుడు హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆప్ తన మొదటి దశలో "సెక్యులరిజం", "వ్యవస్థ మార్పు" అనే నినాదాలతో అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్పుడు హిందూ మెజారిటీ ఓట్లు అవసరమైన చోట హిందూ ధార్మిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా తన వ్యూహాన్ని మార్చుకుంటోంది. పంజాబ్‌లో సిక్కు-హిందూ సమతుల్యత ఉంది. పట్టణాల్లో హిందువులు ఎక్కువగా ఉండటం వల్ల వారి ఓట్లు కావాలంటే ఇలాంటి కార్యక్రమాలు అనివార్యం అని ఆప్ భావిస్తోంది. అయితే ఇది పార్టీ ఆదర్శాలకు విరుద్ధంగా ఉందని విమర్శకులు అంటున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక గమ్యస్థానాలకు జరిగిన ప్రయాణాల్లో 53 శాతానికి పైగా జెన్ జి, యువతరానిదే వాటా ఉండటం గమనార్హం. 2025తో పోలిస్తే ఈ సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. ఈ మార్పు కేవలం ప్రయాణ ధోరణి మాత్రమే కాదు.. యువతలో చోటుచేసుకుంటున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. బీచ్‌లు, పార్టీ హబ్‌లు, నైట్‌లైఫ్ గమ్యస్థానాల కంటే దేవాలయాలు, యోగా కేంద్రాలు, ధ్యాన క్షేత్రాల వైపు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వారు కేవలం దర్శనం కోసం కాకుండా, స్థానిక సంస్కృతిని అనుభవించడం, ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందడం, జీవితానికి అర్థవంతమైన అనుభూతులను జోడించుకోవడం కోసం ఈ ప్రయాణాలను ఎంచుకుంటున్నారు. జెన్ జి తరానికి అత్యంత ఇష్టమైన ఆధ్యాత్మిక గమ్యస్థానంగా తిరుపతి నిలిచింది. ముఖ్యంగా బెంగళూరు?తిరుపతి మార్గం యువ యాత్రికులలో అత్యంత ప్రజాదరణ పొందిన రూట్‌గా అవతరించింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ దర్శనం కోసం లక్షలాది మంది యువకులు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. హైదరాబాద్?తిరుపతి మార్గం కూడా భారీ స్పందనను నమోదు చేసింది. దీంతో దక్షిణ భారతదేశ యువతలో తిరుపతి అత్యంత ప్రాధాన్యమైన పుణ్యక్షేత్రంగా నిలిచింది. తిరుపతి తర్వాత రిషికేశ్, తంజావూరు, వారణాసి(కాశీ), ఉజ్జయిని, నాందేడ్ వంటి ప్రాంతాలు యువ యాత్రికుల మన్ననలు పొందుతున్నాయి. ముఖ్యంగా యోగా, ధ్యానానికి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రిషికేశ్‌కు వెళ్లిన వారిలో 59 శాతం మంది జెన్ జి యువతే కావడం విశేషం. మిలీనియల్స్‌ను కలుపుకుంటే దాదాపు మొత్తం సందర్శకుల్లో యువతరమే అధికంగా కనిపించింది. అలాగే చెన్నై?తంజావూరు, ఇండోర్?ఉజ్జయిని మార్గాలు కూడా యువ ప్రయాణికుల ఆదరణను పొందాయి. ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయానికి 2025 డిసెంబర్ చివరి వారం నుంచి 2026 జనవరి ప్రారంభం వరకు 12 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. వారణాసి, పూరీ, అమృత్‌సర్, హరిద్వార్ వంటి సంప్రదాయ ఆధ్యాత్మిక కేంద్రాలు కూడా యువతతో కిటకిటలాడుతున్నాయి.

## గోవధపై సుప్రీంకోర్టుకు తమిళనాడు ప్రభుత్వం..

### మద్రాస్ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పిటిషన్

గోవధపై నిషేధం విషయంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంలో గోవధను నిషేధిస్తూ గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడు సెక్రెటరీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. మద్రాస్ హైకోర్టు తీర్పు.. తమిళనాడు యానిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్, 1958కి వ్యతిరేకంగా ఉందని తమిళనాడు ప్రభుత్వం




సుప్రీం కోర్టుకు తెలిపింది. తమిళనాడు చట్టం ప్రకారం పదేళ్లు దాటిన గోవులను, సంతానోత్పత్తికి పనికిరాని గోవులను, వ్యవసాయం వంటి వాటిలో పనికి ఉపయోగపడని వాటిని వధించవచ్చు. దీనికి సంబంధిత అథారిటీ నుంచి సర్టిఫికెట్ తీసుకుంటే చాలు. అలాగే, ఇతర కేంద్ర చట్టాలను కూడా తమిళనాడు ప్రభుత్వం ప్రస్తావించింది. దీని ప్రకారం నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని వధించవచ్చని, కానీ, పూర్తిగా గోవధపై నిషేధం విధించే చట్టం లేదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్‌లో హిందూ మక్కల్ కచ్చి సంస్థ యూత్ విభాగం సెక్రెటరీ కే.సూర్య, రాష్ట్ర డీజీపీని ప్రతివాదులుగా పేర్కొన్నారు. అంతకుముందు కే.సూర్య తరఫున గత మే 27న సుప్రీంకోర్టులో అడ్వకేట్ పీవీ యోగేశ్వరన్ పిటిషన్ దాఖలు చేశారు. తమిళనాడులో బక్రీద్ సందర్భంగా ఒక్క గోవును కూడా వధించకుండా చూడాలని కేవియట్ పిటిషన్‌లో కోరారు. దీనికి అనుగుణంగా సుప్రీంకోర్టు కూడా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఒక్క గోవును వధించకూడదని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే, దీన్ని వ్యతిరేకిస్తూ తాజాగా విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## అయోధ్య విరాళాల దుర్వినియోగం.. ఉద్యోగాల కోసం లంచం తీసుకున్నారా..

అయోధ్యలోని రామ మందిర విరాళాల దుర్వినియోగంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై ప్రస్తుతం సమగ్ర విచారణ జరుగుతోంది. ఈ కేసులో మాజీ ట్రస్ట్ అనిల్ మిశ్రా పాత్రపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దృష్టి సారించింది. ఇప్పటికే అరెస్టైన నిందితులను విచారించగా అనిల్ మిశ్రా పేరు పలుమార్లు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. గత వారం ఆయన ట్రస్ట్ పదవికి రాజీనామా చేశారు. దర్యాప్తులో వెలుగుచూసిన వివరాల





ప్రకారం.. రామ మందిరంలో పనిచేస్తున్న కనీసం 125 మంది ఉద్యోగులు అనిల్ మిశ్రా సిఫార్సుతోనే నియమితులయ్యారని అధికారులు అనుమానిస్తున్నారు. ఉద్యోగాల కోసం అనిల్ మిశ్రా లంచాలు కూడా తీసుకున్నారనే ఆరోపణలపై సిట్ విచారణ కొనసాగిస్తోంది. అంతేకాకుండా, ట్రస్టీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఆస్తులు ఎంత మేర పెరిగాయనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల్లో అనుకల్ప్ మిశ్రా, లవ్ కుశ్ మిశ్రా ఉన్నారు. నిధులను కాజేయడంలో వీరి పాత్ర కూడా కీలకమైనదని, వీరిద్దరూ అనిల్ మిశ్రా బంధువులని అధికారులు భావిస్తున్నారు. కాగా, నిందితులు సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా ప్రత్యేక పద్ధతిని అనుసరించి నిధులను కాజేసినట్లు విచారణలో బయటపడింది. ఒక వ్యక్తి నగదును తీసుకెళ్లే సమయంలో మిగిలినవారు అతడి చుట్టూ కెమెరాకు అడ్డుగా నిలబడేవారని అధికారులు తెలిపారు. నగదును సమీపంలోని బాత్‌రూమ్‌లో దాచిపెట్టి, అవకాశం దొరికినప్పుడల్లా బయటకు తీసుకెళ్లేవారని వెల్లడైంది. ట్రస్టు అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో వారిని ఎవరూ తనిఖీ చేయలేదని కూడా దర్యాప్తులో తేలిందిఇక, కౌంటింగ్ రూమ్‌కు చెందిన ఒక తాళం చెవి నిందితులలో ఒకరైన టిన్కూ యాదవ్ దగ్గర, మరొకటి బ్యాంకు సిబ్బంది దగ్గర ఉండేది. నాలుగు విరాళాల పెట్టెలలో జమ చేసిన నగదును, 11 మంది బ్యాంకు సిబ్బంది, ఆలయ ట్రస్ట్ నుంచి మరో ముగ్గురితో సహా మొత్తం 14 మంది సభ్యుల బృందం లెక్కించేది. వీరందరి పాత్రపై ప్రస్తుతం సిట్ దర్యాప్తు సాగిస్తోంది. ఆలయంలో భద్రతా నిబంధనలు పాటించకపోవడం, సీసీటీవీ ఫుటేజీని నిర్ణీత కాలం పాటు భద్రపరచకపోవడంతో పాటు విరాళాల లెక్కింపు ప్రక్రియలో కూడా అనేక లోపాలు ఉన్నట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరికొందరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం

## జూన్‌లో జోరుగా జీఎస్టీ వసూళ్లు.. రూ.1.94 లక్షలు దాటిన ఆదాయం

దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం (ఊు ఎనిఇనీఎవ) రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. అయితే దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధిరేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధిరేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరాయి. ఎగుమతులపై 'ఐస్‌గేట్' (ఎఅఇఉఐఇ) ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టంచేస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.




## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర.. ముగ్గురి అరెస్ట్..





తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమిళనాడు ఇంటెలిజెన్స్ అధికారులు ఈ కుట్రపై దర్యాప్తు చేపట్టారు. టీవీకే పార్టీ ఎమ్మెల్యే ఎన్ ఇళయరాజా కొద్దిరోజుల క్రితం చెన్నై పోలీసులను ఆశ్రయించారు. చెన్నైకి చెందిన ఐబీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. 'తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టమని ఐబీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్‌కు చెందిన వ్యక్తి నాతో చెప్పారు. అలా చేస్తే 35 కోట్ల రూపాయలు ఇస్తానన్నాడు. ఈ ఆఫర్ గురించి ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పారు' అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు ఐబీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిని అరెస్ట్ చేశారు. అతడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి అత్యంత సన్నిహితుడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక, ఈ వ్యవహారంపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ స్పందించారు. సెంథిల్ బాలాజీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. 'సెంథిల్ బాలాజీతో సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తులు ఈ వ్యవహారంలో నేరుగా పాలుపంచుకున్నారు. వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కుట్రలో భాగం అయిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేయాలి. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ముగింపు పలకాలి' అని అన్నారు.

## పాటల హక్కుల వివాదం..

### ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ



ఢిల్లీ, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు 134 సినిమాల పాటల యాజమాన్య హక్కులకు సంబంధించిన కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గతంలో జారీ చేసిన మధ్యంతర నిషేధాజ్ఞను ఎత్తివేయాలని ఇళయరాజా దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ వివాదంలో ప్రముఖ సంగీత సంస్థ సారేగామా 134 చిత్రాల్లోని పాటలపై తమకే కాపీరైట్ హక్కులు ఉన్నాయని కోర్టుకు తెలిపింది. మరోవైపు, తాను స్వరపరిచిన పాటలపై తనకూ హక్కులు ఉన్నాయని ఇళయరాజా వాదిస్తున్నారు. ఈ అంశంపై ఇరు పక్షాల మధ్య న్యాయపోరాటం కొనసాగుతోంది. మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలన్న ఇళయరాజా అభ్యర్థనను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వాటిని ఎత్తివేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కాపీరైట్ వివాదంపై తుది విచారణ పూర్తై.. తుది తీర్పు వెలువడే వరకూ ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని ఢిల్లీ హైకోర్టు వెల్లడించింది. ఈ కేసు తుది తీర్పు సంగీత పరిశ్రమలో కాపీరైట్ హక్కుల విషయంలో కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర



ఢిల్లీ, జులై 1: హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్‌పై రూ. 183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2,930 కి చేరింది. ఈ ధర నిన్నటి వరకూ రూ.3,113 గా ఉంది. ఇక, దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఈ తగ్గింపునకు అనుగుణంగానే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు మారనున్నాయి. అయితే స్థానిక పన్నులకు (ఎం) అనుగుణంగా ఆయా నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరల్లో స్వల్ప తేడాలు ఉంటాయి.

### బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ పాలకమండలి సమావేశం

బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా మార్కెట్లో నెలకొన్న మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించి వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు పలు ప్రతిపాదనలు చేసినట్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ కె. ఆనంద్ బాబు, సెక్రటరీ వెంకటేష్ తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డులో అంతర్గత రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు, మరుగుదొడ్ల ఏర్పాటు కోసం కోటి 8 లక్షల రూపాయల ప్రతిపాదనలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు పంపినట్లు పేర్కొన్నారు. మన కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాలకు సంబంధించి మూడేళ్ల కాల పరిమితులు పొడిగిస్తూ మార్కెట్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

# కులాలు లేకుండా రాజకీయం సాధ్యమేనా

విజయవాడ, జూలై 1 జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష్యం ఆంధ్రప్రదేశ్ లో నెరవేరుతుందా? అన్నది ఇప్పుడు సందేహంగా మారింది. కులాల ప్రస్తావన చేయకుండానే రాజకీయాలు చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పడం ఆచరణలో సాధ్యమేనా? అన్న చర్చ జరుగుతుంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అంటే కులాలతో ముడిపడి ఉన్న రాజకీయం. గత కొన్ని దశాబ్దాలుగా కులాల మధ్యనే రాజకీయం నడుస్తుంది. ఇప్పుడు పవన్ కల్యాణ్ కుల జాడ్యాన్ని కూకటి వేళ్లతో పీకివేయాలని ప్రయత్నించడం సాహసోపేతమైన చర్యగానే చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో ఏ రాజకీయ పార్టీ అయినా కులం పునాదుల మీద నడవాల్సిందే. కొన్ని ఏళ్లుగా అన్ని పార్టీలూ అదే కోవలో నడుస్తున్నాయి కానీ ఇటీవల పవన్ కల్యాణ్ తాను కులం ప్రస్తావన లేకుండానే రాజకీయాలు చేస్తానని చెప్పడం ఒకింత ఆశ్చర్యకరమే. కులాలు పేరు చెప్పి తాను ఓట్లు అడగనని కూడా పవన్ కల్యాణ్ అనడం వచ్చే ఎన్నికల ప్రచారం వరకూ ఆగాల్సిందే. ఎందుకంటే గత ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ కులం ప్రస్తావన తెస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ట్రోల్ చేస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లోనూ కాపు సామాజికవర్గం అండ పవన్ కల్యాణ్ కు అసవరం ఉంటుంది. అప్పుడు ఏం చేస్తారన్నది జనసైనికుల్లోనూ చర్చ మొదలయింది. అయితే పవన్ కల్యాణ్ కు సినిమాల పరంగా కులాలకు, మతాలకు అతీతంగా అభిమానులు ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ రాజకీయాలకు వచ్చే సరికి వేరుగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ లో 27 శాతం ఓటు బ్యాంకున్న కాపు సామాజికవర్గాన్ని తెలివైన ఏ రాజకీయ నాయకుడు దూరం చేసుకోరు. పవన్ కల్యాణ్ కూడా అదే విశ్వాసంతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్నికల సమయానికి తనను వదిలి వెళ్లరన్న ధీమాలో ఆయన ఉన్నారు. కేవలం కాపు సామాజికవర్గం ఓట్లతోనే ఎవరూ గెలవలేరన్న పవన్ కల్యాణ్ మాటల్లోనూ నిజం లేకపోలేదు. అందుకే ముందుగా మిగిలిన సామాజికవర్గ ఓటర్లను దగ్గరకు తీసుకోవడం ప్రథమ లక్ష్యంగా పవన్ కల్యాణ్ పెట్టుకున్నట్లు కనపడుతుంది. చివరకు కాపులు తనను వీడి పోరన్న నమ్మకమే పవన్ ను నోట ఆ మాట పలకిస్తుందంటున్నారు. మరి ఎన్నికల నాటికి పవన్ మాట తీరు ఎలా మారుతుందన్నది చూడాలి.మీరు జనసేన కార్యకర్తా.. నేతగా ఎదగాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం. అప్లికేషన్ సమర్పించండి అంటోంది ఆ పార్టీ అధిష్టానం. పైస్థాయిలో ఉండే లీడర్లు.. కిందిస్థాయి నేతలను నియమించడం, అన్ని పార్టీల్లో ఆనవాయితీగా వస్తోంది. అయితే జనసేన కార్యకర్తల నుంచే నేతలు పుట్టుకురావాలనే ఆలోచనకు, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్..

ఓ ఆకారం ఇచ్చారు. దీంతో కార్యకర్తలను మాత్రమే కాదు.. పార్టీ కోసం నాయకులను తయారుచేసే ఫ్యాక్టరీగా జనసేన మారుతోంది. దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్, మండల, గ్రామస్థాయిలో నేతలుగా ఎదగాలనే ఆసక్తి, రాజకీయ శక్తి ఉన్న జనసైనికులు, వీర మహిళలను ప్రోత్సహిస్తోంది.అభ్యర్థుల నుంచి ఐదు రోజుల పాటు అప్లికేషన్లు తీసుకుంటారు. దీనికోసం క్షేత్రస్థాయిలో 32మందితో పరిశీలన కమిటీ ఏర్పాటుచేశారు. అప్లికేషన్ తీసుకున్నాక, కార్యకర్తలు ఏ ఉద్దేశంతో వస్తున్నారు.. ఎలా పనిచేస్తారు.. వాళ్ల నాయకత్వ లక్షణాలపై స్క్రూటినీ చేస్తారు. దీనికోసం మంగళగిరి జనసేన ప్రధాన కార్యాలయంలో మూడు రకాల డెస్కులు ఏర్పాటుచేశారు. అక్కడ మూడు రకాల అప్లికేషన్లు ఇస్తారు. ఎవరు ఏ కేటగిరీ కింద అప్లయ్ చేయాలనుకుంటే, ఆ అప్లికేషన్ తీసుకోవచ్చు.పార్లమెంట్ స్థాయి నాయకులు, అసెంబ్లీ స్థాయి నాయకులు, మండల, గ్రామస్థాయి?ఇలా రకరకాల స్థాయిల్లో నాయకులను నియమించుకునేందుకు, పార్టీ శ్రేణుల్లో ఆసక్తి ఉన్నవారి నుంచి అప్లికేషన్లు స్వీకరిస్తామన్నారు మంత్రి కందుల దుర్గేష్.క్షేత్రస్థాయిలో నాయకులను నియమించడంలో, పవన్ కల్యాణ్ నిర్ణయమే ఫైనల్ అని మంత్రి తేల్చిచెప్పారు. కార్యకర్తలే నేతలుగా ఎదిగితే?క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందనే ఆలోచనతో జనసేన ఈ కార్యాచరణ చేపట్టింది.

# స్థానిక సంస్థల ఎన్నికలపై మీనమేషాలు

విజయవాడ, జూలై 1 ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల జైత్రయాత్ర తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా ప్రస్తుతం ఎలాంటి అడ్డంకులు లేవు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో కూటమికి అనుకూల గాలి స్పష్టంగా వీస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని మెజారిటీ పంచాయతీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు మున్సిపల్ సంస్థల పదవీ కాలం ముగిసిపోయి, స్థానిక సంస్థలన్నీ ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లాయి. సాధారణంగా ఇలాంటి క్లీన్ పొలిటికల్ అట్మాస్ఫియర్ ఉన్నప్పుడు ఏ అధికార పార్టీ అయినా తక్షణమే స్థానిక ఎన్నికలు జరిపి కింది స్థాయి వరకు అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తుంది. కానీ, ఏపీలో మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎప్పుడు అంతర్గత సమీక్షలు జరిగినా మరో రెండు, మూడు నెలల్లో స్థానిక ఎన్నికలు అని చెబుతారు కానీ.. అడుగు ముందుకు పడటం లేదు. వేసవి సెలవుల కాలంలోనే పంచాయతీ, పురపాలక ఎన్నికలను పూర్తి చేసి ఉంటే అడ్మినిస్ట్రేటివ్ పరంగా ఎంతో అనుకూలంగా ఉండేది. అయినప్పటికీ ప్రభుత్వం ముందడుగు వేయకపోవడం వెనుక ప్రధాన కారణం వైసీపీ లోకల్ క్యాడర్ ను మరింత అలసిపోయేలా చేయడమేనని అనుకుంటున్నారు. మరికొన్నాళ్ల పాటు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగిస్తూ, గత ప్రభుత్వ అవినీతిపై విచారణలు జరిపి, లీగల్‌గా వారిని కట్టడి చేయడం ద్వారా.. వైసీపీకి కనీసం పోటీ చేసే ఓపిక లేకుండా చేసే ప్లాన్ ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. మరోవైపు, స్థానిక ఎన్నికల జాప్యం వెనుక కూటమి అంతర్గత సమీకరణాల లెక్కలు కూడా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్ల పంపకం పైస్థాయిలో సజావుగా సాగిపోయింది కానీ, గ్రామ స్థాయికి వచ్చేసరికి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రతి ఊరిలోనూ ప్రెసిడెంట్ సీటు కోసం, ప్రతి డివిజన్‌లోనూ కార్పొరేటర్ సీటు కోసం ఇరు పార్టీల స్థానిక నేతలు పట్టుబడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ ఎన్నికలు పెడితే తమ్ముళ్ల మధ్య కొత్త పంచాయతీలు మొదలై కూటమి సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను ముగించి, కీలక నేతలకు వివిధ కార్పొరేషన్లలో సర్దుబాటు చేసిన తర్వాత.. నియోజకవర్గాల వారీగా పూర్తి సమన్వయం కుదిరినప్పుడే స్థానిక సంస్థల బరిలోకి దిగాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఒక అండర్‌స్టాండింగ్‌కు వచ్చినట్లు సమాచారం.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సూపర్ సిక్స్ హామీల అమలు కూడా ఈ

నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతానికి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పునరుద్ధరణపైనే పూర్తి నిధులు, శ్రద్ధ పెడుతోంది. స్థానిక ఎన్నికలు వస్తే ప్రభుత్వ యంత్రాంగం అంతా మళ్లీ కోడ్ పరిధిలోకి వెళ్లిపోతుంది, పరిపాలన స్తంభిస్తుంది. అలా కాకుండా, మొదట ప్రభుత్వ గ్యారంటీల అమలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రజల్లో పూర్తి స్థాయి నమ్మకం సంపాదించిన తర్వాత.. ఆ ఊపులోనే స్థానిక ఎన్నికలను ఏకపక్షంగా స్వీప్ చేయాలనేది చంద్రబాబు అసలు వ్యూహం చంద్రబాబు నాయుడు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, శత్రువు పూర్తిగా బలహీనపడే వరకు, తన కూటమి శ్రేణులు పూర్తి సమన్వయానికి వచ్చే వరకు ఓపికగా వేచి చూస్తున్నారు. బడ్జెట్ ఆమోదం, నామినేటెడ్ పదవుల ప్రక్రియ ముగిసిన తర్వాత.. బహుశా ఈ ఏడాది ఆఖర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలోనే స్థానిక సమరానికి శంఖారావం పూరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతవరకు ప్రత్యేకాధికారుల ద్వారానే గ్రామాలు, నగరాల్లో కూటమి మార్క్ పాలనను జనానికి రుచి చూపించాలనేదే ప్రభుత్వ ప్రస్తుత రోడ్ మ్యాప్ అనుకోవచ్చు.

# సునీల్ కు షాకిచ్చిన భార్య

అమరావతి, జూలై 1 ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్.. మంగళవారం(జూన్ 30) రిటైర్మెంట్ కానున్నారు. గతంలో ఆయన సీఐడీ చీఫ్‌గా పనిచేశారు. ఆ సమయంలో రఘు రామను లక్ష్యంగా చేసుకున్నారన్న వాదన ఉంది. వైసీపీ నేతలకు సహకరించి ఆయనను వేధించారని కేసు కూడా నమోదైంది. ఇదిలావుంటే, కూటమి సర్కారు వచ్చిన త ర్వాత.. ఆయనను సస్పెండ్ చేశారు. గతంలో అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న సమయంలో ఉన్నతాధికారులకు చెప్పకుండానే విదేశాలకు వెళ్లారన్నది ఆయనపై ఉన్న మరో ఆరోపణ.ప్రస్తుతం ఈ విషయంపైనే ప్రభుత్వం విచారణ చేస్తోంది. కోర్టులో ఈ కేసు పెండింగులో ఉంది. ఇంతలోనే సునీల్ కుమార్ రిటైరయ్యారు. అయితే.. ఆయనకు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలుపుదల చేయరాదని, రిటైర్మెంట్ విషయంలో కేసులను చూపించి ఇబ్బందులు కలిగించరాదని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే.. అసలు సమస్య ఐపీఎస్ సునీల్ కుమార్ సతీమణి నుంచే ఎదురైంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద దక్కే సుమారు కోటి రూపాయలకు పైగా సొమ్మును నిలుపుదల చేయాలంటూ ఆమె ప్రభుత్వానికి విన్నించారు.ఈ మేరకు సునీల్ సతీమణి అరుణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. తన భర్తతో తనకు కుటుంబ పరమైన వివాదాలు ఉన్నాయని.. 2017లోనే తాను కోర్టును ఆశ్రయించి గృహ హింస చట్టం కింద కేసు పెట్టానని పేర్కొన్నారు. ఈ కేసులో పెండింగులో ఉన్న నేపథ్యంలో బెనిఫిట్స్‌ను నిలుపుదల చేయాలని కోరారు. ఒకవేళ ఇప్పుడే ఆ సొమ్మును ఆయనకు ఇచ్చేస్తే భవిష్యత్తులో తనకు ఇబ్బంది ఏర్పడుతుందని.. ఆ సొమ్మును ఇతరుల ఖాతాలకు మళ్లించే ప్రమాదం ఉందని అరుణ పేర్కొన్నారు. తన జీవించే హక్కును దృష్టిలో పెట్టుకొని.. సునీల్‌కుమార్ రిటైర్మెంటు బెనిఫిట్స్‌ను నిలుపుదల చేయాలని ఆమె కోరారు.ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం బెనిఫిట్స్‌ను నిలుపుదల చేస్తూ.. సోమవారం మరో ఉత్తర్వు జారీ చేసింది. దీంతో సునీల్‌కు సొమ్ము విడుదల వ్యవహారం సంకటంగా మారింది. అయితే.. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాలు జోక్యం చేసుకునే అవకాశాలు చాలా తక్కువ. గతంలో సుప్రీంకోర్టు కూడా ఉద్యోగి జీత భత్యాలు సహా.. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ఆ ఉద్యోగికి మాత్రమే హక్కు ఉంటుందని.. స్పష్టం చేసింది. ఈ నిధులను ఆపేందుకు లేదా వేరే వారికి బదిలీ చేసేందుకు సంపూర్ణ హక్కు ఉద్యోగికి మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. దరిమిలా.. ఇప్పుడు సర్కారు ఏం చేస్తుందన్నది చూడాలి.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సునీల్ కుమార్.. అప్పట్లో ప్రతిపక్ష నేతలను, విమర్శకులను తీవ్రంగా టార్గెట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును నాటి కస్టడీలో భౌతికంగా హింసించిన కేసులో సునీల్ కుమార్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయన ఇప్పటికే గుంటూరు సీసీఎస్ పోలీసుల ముందు విచారణకు కూడా హాజరయ్యారు. ఒకవేళ ఆయన ఏదైనా రాజకీయ పార్టీలో చేరి మైక్ పట్టుకుందామని భావించినా.. ఈ కస్టోడియల్ టార్చర్ కేసుతో పాటు అగ్రిగోల్డ్ బాధితుల రిలీఫ్ ఫండ్స్ దుర్వినియోగానికి సంబంధించి



అవినీతి నిరోధక శాఖ జరుపుతున్న అధికారిక విచారణలు ఆయనకు నిరంతరం చట్టపరమైన చిక్కులను తెచ్చిపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.సునీల్ కుమార్ రాజకీయ భవిష్యత్తుకు కేవలం ప్రభుత్వ పరమైన కేసులే కాకుండా.. క్షేత్రస్థాయిలో సొంత సామాజికవర్గ సీనియర్ లీడర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దళిత అజెండాతో ఆయన నడుపుతున్న అంబేడ్కర్ ఇండియా మిషన్ అనే సంస్థ వెనుక ఉన్న అసలు రహస్యాలను దళిత నేతలే బట్టబయలు చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాల సీనియర్ దళిత నేత, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కుమారులు గత కొన్ని వారాలుగా సోషల్ మీడియా వేదికగా సునీల్ కుమార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పొలిటికల్ వార్ నడుపుతున్నారు. ఒక ఐపీఎస్ అధికారిగా ఉంటూ సునీల్ కుమార్ నడిపిన మత సంస్థల వివరాలు, దానికి విదేశాల నుండి వచ్చినట్లు చెప్తున్న నిధులు, భారీ ఆర్థిక లావాదేవీలు, యన కూడబెట్టిన బినామీ ఆస్తుల లెక్కలను ఆధారాలతో సహా పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకువచ్చారు. దళితుల సంక్షేమం పేరిట సునీల్ కుమార్ తన సొంత సామ్రాజ్యాన్ని ఏ విధంగా నిర్మించుకున్నారనే అంశంపై హర్షకుమార్ వర్గం చేసిన దాడులు ఆయన సామాజిక క్రెడిబిలిటీని తీవ్రంగా దెబ్బతీశాయి.ఇప్పటివరకు ఐపీఎస్ హోదా, సర్వీస్ రూల్స్ అడ్డం పెట్టుకుని తనపై వచ్చే ఆరోపణలను సాంకేతికంగా ఎదుర్కొన్న సునీల్ కుమార్‌కు.. ఇకపై అలాంటి రక్షణ కవచాలేవీ ఉండవు. సాధారణ పౌరుడిగా మారిన తరుణంలో.. ప్రభుత్వం ఆయన ఆర్థిక మూలాలను, ట్రస్టుల వెనుక ఉన్న విదేశీ ఫండింగ్ నెట్‌వర్క్‌ను లోతుగా తవ్వేందుకు సిద్ధమవుతోంది. ఈ లెక్కలన్నీ పూర్తిగా బయటకు తీసి ప్రజల ముందు పెడితే.. పీవీ సునీల్ కుమార్‌కు సామాజికంగా గౌరవం ఇవ్వాలో, ఆయనను నాయకుడిగా అంగీకరించాలో లేదో ప్రజలే స్వయంగా తేల్చుకుంటారు. ఖాకీ చొక్కా విడిచాక సింహంలా రాజకీయాల్లోకి వద్దామనుకున్న మాజీ ఐపీఎస్ అధికారి.. ఇప్పుడు చుట్టుముట్టిన లీగల్ కేసులు, ఆస్తుల వివాదాల చక్రబంధం నుండి ఎలా బయటపడతారనేది చేతుల్లోనే ఉంది.

# భారీగా తగ్గిన పోర్టుల పరిధి

నెల్లూరు, జూలై 1, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం ఓడరేవుల నోటిఫైడ్ పరిధిని ప్రభుత్వం భారీగా తగ్గించింది. గత ప్రభుత్వం ఈ పోర్టుల పరిధిని అత్యధిక కిలోమీటర్ల మేర విస్తరిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్లను సవరిస్తూ కూటమి ప్రభుత్వం తాజా ఉత్తర్వులు ఇచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం రెండు పోర్టుల పరిధిని చెరి 15 కిలోమీటర్లకు పరిమితం చేశారు. గతంలో రామాయపట్నం నాన్-మేజర్ పోర్టు పరిధిని సముద్ర తీరం వెంబడి ఏకంగా 51 కిలోమీటర్ల మేర విస్తరిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.అయితే ఇంత పెద్ద పరిధి అవసరం లేదని భావించిన ప్రస్తుత ప్రభుత్వం, దానిని కేవలం 15 కిలోమీటర్లకు కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే విధంగా కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం పోర్టు పరిధిని కూడా గతంలో సముద్ర తీరం వెంబడి 64 కిలోమీటర్ల మేర నోటిఫై చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈ విస్తీర్ణాన్ని కూడా భారీగా తగ్గించి, కేవలం 15 కిలోమీటర్లకే పరిమితం చేశారు. పరిధి తగ్గించడానికి గల ప్రధాన కారణాలు ఒకసారి చూస్తే.. పోర్టుల పరిధి 50 నుండి 64 కిలోమీటర్ల మేర ఉండటం వల్ల ఆయా తీర ప్రాంతాల్లో స్థానిక మత్స్యకారులు వేటాడటానికి, బోట్లు నిలుపుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.వారి జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## రాజధాని పనులు..ఎవరి ట్రాప్ లో ఎవరు



అమరావతి, జూలై 1 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని అమరావతి చాప్టర్ ఎప్పుడూ అత్యంత సున్నితమైన, ఉద్వేగభరితమైన అంశం. సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక పరాజయం తర్వాత కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు, చేస్తున్న పర్యటనలు ఆ పార్టీకి మేలు చేయడం పక్కన పెడితే.. ప్రజల్లోకి తీవ్రమైన చర్చకు కారణం అవుతున్నాయి. తాజాగా అమరావతి పరిధిలో వైసీపీ నేతలు చేపట్టిన పర్యటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయడం, దానిని అడ్డం పెట్టుకుని అధికార తెలుగుదేశం పార్టీ కూటమి తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగడం ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాజధాని విషయంలో వైసీపీ ఏం చేసినా అది ఆ పార్టీకే సెల్ఫ్ గోల్ లా మారుతోందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. అమరావతి రాజధానికి భూములు ఇవ్వడానికి ఇష్టపడని అతికొద్ది మంది వ్యక్తులను, తమ పార్టీ సానుభూతిపరులను తెరపైకి తెచ్చి వైసీపీ సరికొత్త రాజకీయ నాటకానికి తెరలేపిందని టీడీపీ ఆరోపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా పుంజుకుంటున్న తరుణంలో.. ఎలాగైనా ఈ పనులను అడ్డుకోవాలని, ఇక్కడ మళ్లీ వివాదాలు రాజేయాలనే కుట్రతోనే వైసీపీ నేతలు ఈ పర్యటనలు పెట్టుకున్నారని టీడీపీ నేతలు అంటున్నామని. తాము అధికారంలో ఉంటే మావిగన్ అంటామని, విపక్షంలో ఉంటే మళ్లీ అమరావతి ఆపేస్తామని మాట్లాడే నేతలు ఇక్కడికి వస్తే.. సహజంగానే రైతులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని కూటమి శ్రేణులు వాదిస్తున్నాయి.వైసీపీ నేతల పర్యటనలో స్థానిక రైతులు కాకుండా.. గతంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై భౌతిక దాడులకు పాల్పడిన నిందితులు, పలువురు పేరుమోసిన రౌడీషీటర్లు ఉండటం ఆ పార్టీని మరింతగా డిఫెన్స్‌లో పడేసింది. శాంతిభద్రతల సమస్యను సృష్టించడానికే రౌడీ మూకలతో రాజధాని గ్రామాల్లోకి వచ్చారనే విమర్శలకు వైసీపీ బలమైన కౌంటర్ ఇచ్చుకోలేకపోయింది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో వైసీపీ వ్యూహాత్మకంగా తీవ్రమైన పొరపాటు చేసింది. నిజంగానే అమరావతి పరిధిలో భూ నష్టపరిహారం లేదా ల్యాండ్ పూలింగ్ విషయంలో ఎవరికైనా అన్యాయం జరిగి ఉంటే, వారు న్యాయపోరాటం చేసుకోవడానికి లీగల్ సెల్ ద్వారా సహాయం చేయడం పూర్తిగా వేరు. కానీ, అలా కాకుండా వందలాది మంది అనుచరులతో, వివాదాస్పద వ్యక్తులతో రాజధాని ప్రాంతంలోకి ప్రవేశించి ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించడం ద్వారా.. రాజధాని అభివృద్ధికి తాము పూర్తిగా వ్యతిరేకమనే పాత ముద్రను వైసీపీ స్వయంగా మరింత బలోపేతం చేసుకున్నట్లయింది. ఇది చంద్రబాబు ప్రభుత్వానికి రాజకీయంగా ఒక అయాచిత అస్త్రాన్ని అందించింది. టీడీపీకి విమర్శలు గుప్పించడానికి మంచి అవకాశం దొరికింది. ఐదేళ్ల పాటు అమరావతిని శ్మశానం అని, 'భూ కుంభకోణం' అని అవహేళన చేసిన వైసీపీ.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఇక్కడ తిరుగుతోందని మంత్రులు లోకేష్, నారాయణలు నిలదీస్తున్నారు. తాము అమరావతిని గ్లోబల్ సిటీగా మారుస్తుంటే.. వైసీపీ మళ్లీ విధ్వంసానికి ప్లాన్ చేస్తోందని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో టీడీపీ విజయవంతమైంది. దీనివల్ల అమరావతి సెంటిమెంట్ ఉన్న కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీపై మరింత వ్యతిరేకత పెరుగుతుందని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాజధాని అమరావతి విషయంలో వైఎస్సార్సీపీ ఒక స్పష్టమైన, స్థిరమైన విధానానికి రావలసిన అవసరం ఉందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు మావిగన్, మూడు రాజధానుల ముసుగును వదలకుండా.. మరోవైపు అమరావతిలో హక్కుల పోరాటం అంటూ రెండు పడవల ప్రయాణం చేయడం వల్ల రాజకీయంగా ఎలాంటి మైలేజ్ రాదు. ప్రజల నాడిని పసిగట్టకుండా ఇలాంటి ఉద్రిక్త పర్యటనలు కొనసాగిస్తే, రాబోయే రోజుల్లో పార్టీ ఉనికి క్షేత్రస్థాయిలో మరింత ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని అంటున్నారు.

## జగన్ పాదయాత్రపై తర్జనభర్జనలు

కడప జూలై 1 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్రలకు ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ప్రజలతో నేరుగా కలిసే అవకాశాన్ని కల్పించే ఈ విధానాన్ని గతంలో పలువురు నాయకులు విజయవంతంగా ఉపయోగించారు. ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి పాదయాత్ర చేపట్టే అవకాశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. అధికారాన్ని కోల్పోయిన తర్వాత పార్టీని మళ్లీ ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఆలోచనలో వైసీపీ ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.గత ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ శ్రేణులను మరింత చురుకుగా మార్చాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వైసీపీలో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం, భవిష్యత్ ఎన్నికలకు బలమైన పునాది వేయడం వంటి లక్ష్యాలతో పాదయాత్రను ఒక రాజకీయ



సాధనంగా పరిశీలిస్తున్నారనే ప్రచారం కొనసాగుతోంది.జగన్ గతంలో నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకొచ్చిందని పార్టీ నాయకులు తరచూ గుర్తుచేస్తుంటారు. ఆ యాత్ర ద్వారా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి బలమైన మద్దతు లభించిందని వారు భావిస్తున్నారు. అదే అనుభవాన్ని మరోసారి ఉపయోగించుకోవచ్చా అనే అంశంపై అంతర్గతంగా చర్చ జరుగుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.ఇటీవల వివిధ జిల్లాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహిస్తున్న సమావేశాల్లో కూడా సంస్థాగత బలోపేతంపై ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, స్థానిక సమస్యలపై స్పందించడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం.అయితే పాదయాత్రపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. పార్టీ నాయకత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు ఇవన్నీ రాజకీయ చర్చలుగానే పరిగణించాల్సి ఉంటుంది.

# భాష్యం స్కూల్ నందు డాక్టర్స్ డే!!!..



విభారే న్యూస్ జూలై 01 ఎమ్మిగనూరు..భాష్యం స్కూల్ చైర్మన్ రామకృష్ణ సార్ జెడిఓ శ్రీమతి కవిత ఆదేశాల మేరకు డాక్టర్స్ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ వన్ జడివో శ్రీమతి కవిత శ్రీమతి కవిత విద్యార్థిని విద్యార్థులతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లకు పుష్పగుచ్ఛమిచ్చి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూతల్లి జన్మనిస్తే డాక్టర్ పునర్జన్మనిస్తాడని కవిత అన్నారు. ఆపదలో ఉన్న మనిషికి డాక్టర్ వైద్యం అందించి పునర్జన్మ నిస్తాడాని అందుకే డాక్టర్లను వైద్యోనరాయన హరి అంటరాని చెప్పారు.. కనిపెంచిన తల్లిదండ్రులు, విద్యా. బుద్ధి నేర్పిన గురువులు తరువాత దేవుడితో డాక్టర్ సమానం అని తెలిపారు.. అందుకే ప్రతి ఒక్కరు డాక్టర్లను గౌరవించాలని ఆమె అన్నారు.. ఇందులో ప్రిన్సిపాల్ నాగరాజు తో పాటు ఓఇనీ అనురాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఏ దినోత్సవం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1: జాతీయ చార్టెడ్ అకౌంటెంట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ పాలూరు గోపికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సీఏ కోర్సు ప్రాధాన్యం, జీఎస్టీ, కామర్స్ రంగంలోని ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కామర్స్ విద్యకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, డిగ్రీ అనంతరం విద్యార్థులు సీఏ వంటి ఉన్నత కోర్సులు అభ్యసించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ కేబీవీ సుబ్బయ్య విద్యార్థులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పాలూరు గోపికృష్ణను శాలువా, జ్ఞాపికతో కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ డి. పుల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనపై మంత్రి సమీక్ష--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బనగానపల్లె పర్యటన ఏర్పాట్లపై ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షెరాన్‌తో కలిసి సభా ప్రాంగణం, హెలిపాడ్ ఏర్పాట్లకు అనువైన స్థలాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సభా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా కమిటీ ఏర్పాటు--

## గౌరవ సలహాదారుగా నంద్యాల మార్కెట్ ప్రసాద్ ఎంపిక--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1: నంద్యాల జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పత్తికొండ బాలాజీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకటరాముడు, ×గౌరవ సలహాదారుగా నంద్యాల మార్కెట్ ప్రసాద్ (లక్కబోయిన ప్రసాద్)×ను నియమించారు. జిల్లా కన్వీనర్‌గా తెలుగు వెంకటలక్ష్మి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుంకరి రాజు, రాష్ట్ర కార్యదర్శిగా అనగల శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పుట్టా శివ, రాష్ట్ర కన్వీనర్‌గా తెలుగు అరుణకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలిగా తెలుగు సరస్వతి, జిల్లా కార్యదర్శులుగా దస్తపురి వెంకటలక్ష్మి, శీలం రవి, జిల్లా ఖజాంచీగా రమేష్ కుమార్, జాయింట్ ఖజాంచీగా పత్తికొండ ధనలక్ష్మిలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా దస్తపురి వెంకటరమణ, తెలుగు శ్రీనివాసులుతో పాటు పలువురిని ఎంపిక చేశారు. నూతన కమిటీ మత్స్యకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సామాజిక?ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

# ఎస్ఐఆర్ పనులు వేగవంతం చేయాలి--

## బీఎల్‌వోలకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచనలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 1:జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా బీఎల్‌వోలకు



సూచించారు. బుధవారం నందవరం-1, 2 సచివాలయాల పరిధిలోని 188, 189, 190, 191 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎస్ఐఆర్ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల నుంచి ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసి, తప్పులు లేని ఓటరు జాబితా తయారుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ముందు పూర్తిగా ధృవీకరించాలని, సందేహాలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం సెల్‌ఫోన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# యాలూరి స్వామిరెడ్డికి ఘన నివాళి--

## 113వ జయంతి సందర్భంగా సీపీఐ నేతల స్మరణ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ మాజీ కార్యదర్శి, తామ్రపత్ర అవార్డు గ్రహీత కామ్రేడ్ యాలూరి స్వామిరెడ్డి 113వ జయంతి సందర్భంగా నంద్యాలలోని సీపీఐ కార్యాలయం స్వామిరెడ్డి భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కే. ప్రసాద్ మాట్లాడుతూ స్వామిరెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు రైతు, కార్మిక ఉద్యమాలకు విశేష సేవలందించి, ఉమ్మడి కర్నూలు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజల కోసం జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన త్యాగమూర్తిగా ఆయనను స్మరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఏ. శివయ్య యాదవ్, డి. శ్రీనివాసులు, పట్టణ సహాయ కార్యదర్శి భూమన శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ, నాయకురాలు అన్నపూర్ణమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, జూలై 01:- సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామంలోని సచివాలయం -1, 2 ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి పరిధిలో ఉండే ఆయా శాఖల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎం లు వారి పరిధిలో ఉండే మహిళలు గర్భం దాల్చినట్లు నిర్ధారణ అయిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. అదే విధంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యం గురించి క్రమం తప్పకుండా మానిటర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో తీవ్రమైన తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు ఎంతమంది ఉన్నారు, మితమైన తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు ఎంతమంది ఉన్నారని కలెక్టర్ సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హెచ్.కైరవాడి గ్రామంలో లైవ్ స్టాక్ లోన్లు ఇప్పించేందుకు ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులను బ్యాంక్ కు పంపించారని, అందులో ఎన్ని ఆమోదించారని కలెక్టర్ పశుసంవర్థక శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సెక్సార్టెడ్ సెమెన్ ఎంత చేశారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ లే ఔట్ లో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని కలెక్టర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫార్మ్స్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ, డిజిటైజేషన్ ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందని కలెక్టర్ విఆర్ఓ ని అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ 100 శాతం పూర్తయిందా అని కలెక్టర్ వెల్ఫేర్ అసిస్టెంట్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న--

## లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేత--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నంద్యాల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న బుధవారం ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బి. శేషన్న మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా, సమయానికి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా చెస్ విజేతలకు బహుమతులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1:నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి రాపిడ్, బ్లిట్జ్ చెస్ పోటీల విజేతలకు ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం వైస్ చైర్మన్, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. రాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో తొలి స్థానం సాధించిన మామిళ్ల యుగంధర్, రాపిడ్‌లో రెండో స్థానం పొందిన సాయి రోహన్, బ్లిట్జ్‌లో రెండో స్థానం సాధించిన మారబత్తిన నీలేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నంద్యాల జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నిరంతర సాధనతో ఉన్నత విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. జూలై 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నంద్యాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నీలా ప్రసాద్, రాజా రమేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# మిడుత్తూరులో విద్యార్థినులకు శక్తి యాప్ అవగాహన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 1:మిడుత్తూరు మండలంలోని ఇంటర్ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్, సైబర్ భద్రత, పోక్సో చట్టం, మహిళల రక్షణ, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, నందికొట్కూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం సూచనలతో శక్తి బృందం సభ్యులు మహిళా ఏఎస్ఐ నీతమ్మ, కానిస్టేబుల్ రసూల్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల సహాయం కోసం శక్తి హెల్ప్‌లైన్ 7993485111, సైబర్ మోసాలపై 1930కు ఫిర్యాదు చేయాల్సిన విధానాన్ని వివరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే పోక్సో చట్టంలోని ముఖ్యాంశాలను వివరించి, ప్రతి కుటుంబం శక్తి యావ్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీ.టి. శ్రీదేవి, ఏఎస్ఐ సుబ్బయ్య, జీఎంఎస్‌కేఎస్ సభ్యులు అరుణ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190